
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
గురువారం 11 ఏప్రిల్ 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 24.0

సూపర్ సిక్స్‌తో సంక్షేమం



కూటమి గెలిస్తే తణుకులో హైటెక్ టవర్

- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం
- అన్నదాతకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సహాయం
- వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పెన్షన్
- అవినీతిలో కారుమూరి మహా ముదురు

ఆరిమిల్లిని, వర్మను గెలిపించాలని చంద్రబాబు పిలుపు

భీమవరం/తణుకు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి బృందం):'తణుకు సభ అదుర్స్ కూటమి అభ్యర్థులను గెలిపించండి. అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్‌తో సంక్షేమ పథకాలను అమలు చేస్తాం. ఆడ బిడ్డ నిధి కింద ప్రతి ఆడపిల్లకు నెలకు రూ.1500, తల్లికి వందనం కింద ప్రతి బిడ్డకు రూ.15 వేలు, ఏడాది మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, అన్నదాతకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సహకారం, యువగళం పథకంలో ఐదేళ్లలో యువతకు 20 లక్షలు ఉద్యోగాలు కల్పిస్తాం. వృద్ధులకు, వితంతువులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ అందజేస్తాం' అంటూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించారు. తణుకులో బుధవారం సాయంత్రం నిర్వహించిన ప్రజాగళం సభకు వేలాదిగా జనం రావడంతో ఉత్సాహంగా.. ఉత్తేజంగా ప్రసంగించారు. చంద్రబాబు మంత్రి కారుమూరి అవినీతి దందాను ఎండగట్టారు. 'నా 14 ఏళ్ల ముఖ్యమంత్రి అనుభవంలో మంత్రి కారుమూరి వంటి అవినీతిపరుడిని చూడలేదు. కారుమూరి మహా ముదురు. తణుకులో రూ.850 కోట్ల టీడీఆర్ బాండ్‌ల కుంభకోణానికి పాల్పడ్డాడు. తిరుపతి వంటి నగరాల్లో టీడీఆర్ బాండ్‌ల అవినీతికి మార్గదర్శకుడయ్యాడు. ఇళ్ల స్థలాల కోసం తక్కువ ధరకు భూములు కొని, ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్మాడు. పేదల ఇళ్ల స్థలాల కేటాయింపులోనూ రూ.30 వేల నుంచి 50 వేల వరకు వసూలు చేశారు. రేషన్ బియ్యాన్ని కాకినాడ పోర్టుకు రవాణా చేసి అడ్డంగా దోచుకున్నారు. ధాన్యం మొలకెత్తుతున్నాయంటూ రైతు తమ సమస్యను మంత్రి దృష్టికి వెళితే ఎర్రిపప్ప అంటూ సంబోధించాడు. పైగా ఎర్రిపప్ప అంటే తప్పులేదంటూ చెప్పుకొచ్చాడు. అందుకే ఎర్రి పప్ప మంత్రిని ఎన్నికల్లో సాగనంపండి' అంటూ చంద్రబాబు పిలుపునిచ్చారు. ఆ మాట అనగానే జనమంతా కేరింతలు పెట్టారు. వారాహి యాత్రను అడ్డుకోవడానికి జన సైనికునిపై మంత్రి దాడి చేయించారు. పవన్ కల్యాణ్ కన్నెర్ర చేస్తే ఎక్కడికి పోతావ్ అంటూ కారుమూరిని చంద్రబాబు నిలదీశారు. ఏ బిల్డర్ అయినా నిర్మాణం చేపట్టాలన్నా.. వెంచర్ వేయాలన్నా కారుమూరి ట్యాక్స్ కట్టాలి. అభివృద్ధి చేయాలన్నా కె ట్యాక్స్ తప్పనిసరి. రానున్న ఎన్నికల్లో మంత్రి కారుమూరిని బుద్ధి చెప్పండి అంటూ చంద్రబాబు పిలుపునిచ్చారు. కూటమి గెలిస్తే తణుకు పట్టణంలో హైటెక్ టవర్‌ను ఏర్పాటు చేస్తాం. ఇంటి నుంచే ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగం చేసుకునేలా యువతకు ఉపాధి కల్పిస్తాం అంటూ చంద్రబాబు భరోసా ఇచ్చారు.


ప్రజాగళం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, చిత్రంలో పవన్, ఎమ్మెల్యే అభ్యర్థి ఆరిమిల్లి, ఎంపీ అభ్యర్థి వర్మ... బ్రోచర్ ఆవిష్కరణ



వైసీపీ పాలనను తరిమి కొట్టాలి

తణుకు ఎమ్మెల్యే అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రజా వేదిక కూల్చివేతతో ఐదేళ్ల విధ్వంసకర పాలన మొదలు పెట్టిన జగన్ హయాంలో అవినీతి అరాచకాలే. ఈ పాలనకు చరమగీతం పాడాలి. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి తీసుకువచ్చి అభివృద్ధికి బాటలు వేసుకోవాలి. కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు తణుకు నాంది కావాలి. ఇక్కడ స్థానిక మంత్రి అన్నివర్గాలను దోచేశారు. టీడీఆర్ కుంభకోణానికి పాల్పడ్డారు. అవినీతిలో వైసీపీ బ్రాండ్ అంబాసిడర్. నేను ఎమ్మెల్యేగా తణుకును ఎంతో అభివృద్ధి చేశాను. మరోసారి అవకాశం కల్పిస్తే మాస్టర్ ప్లాన్ ద్వారా పట్టణాభివృద్ధి, కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం వంటి పనులు చేస్తా' అని హామీ ఇచ్చారు. నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ 'రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపిన వ్యక్తి చంద్రబాబు. తణుకులో జన సమూహం చూస్తే కూటమికి 170 సీట్లు ఖాయం. రాష్ట్రంలో సీఎం జగన్ ప్రజలను మోసం చేస్తున్నాడు. ఒక చేతితో వంద ఇచ్చి మరో చేత్తో వెయ్యి దోచుకుంటున్నాడు. ప్రజలు ఆలోచించి కూటమి అభ్యర్థులను గెలిపించాలి' అని కోరారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ 'అధికార పార్టీ నాయకుల అబద్దపు వాగ్దానాలు, ప్రచారాలను నమ్మవద్దు. రాత్రి పూట అధికారులను స్వప్రయోజనాలకు వాడుకుంటున్నారు. నవరత్నాలు విఫలమయ్యాయి. దోపిడి సొమ్ములు పంపిస్తున్న జగన్ డబ్బుతో నెగ్గాలని చూస్తున్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించి, భవిష్యత్‌ను బాగు చేసుకోవాలి' అని కోరారు. తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ దోపిడీకి కేరాఫ్‌గా మారిన జగన్ అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపి, అభివృద్ధి కోసం చంద్రబాబు కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. జగన్‌ను ఇంటికి పంపించకుంటే మనం ఇంటిలో ఉండలేమని నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణం రాజు అన్నారు. అవినీతి పాలనకు వ్యతిరేకంగా ఏర్పడిన ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ కోరారు.

తణుకులో రోడ్ షో.. ప్రజాగళం సూపర్ సక్సెస్

అవినీతి సొమ్ముతో ఎన్నికల్లో తండ్రీకొడుకుల పోటీ

- జగన్ సహా వీరిని గోస్తనీ నదిలో కలిపేయాలి
- మంత్రి కారుమూరిపై పవన్ కల్యాణ్ ఫైర్



'తణుకులో జనసేనకు సీటు ప్రకటించా. పొత్తులో ఇవ్వలేకపోయా. అనకాపల్లి ఎంపీ స్థానాన్ని మా అన్న నాగబాబుకు ఇవ్వాలని ప్రకటించాం. కానీ పొత్తులో బీజేపీకి ఇచ్చాం. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం తగ్గాం. అంతే కాని జనసేనను తగ్గించాలని కాదు. మా వాళ్లు ఒకరు తగ్గితే. మీరు గెలుస్తారు. మీకు ఉద్యోగ అవకాశాలు వస్తాయి. రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అందుకే అందరికీ సీట్లు ఇవ్వలేకపోయాం. ఎక్కడ నెగ్గాలో కాదు. ఎక్కడ తగ్గాలో తెలియాలి. ఈ విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలి. తణుకులో ఆరిమిల్లి రాధాకృష్ణను గెలిపించాలి' అంటూ పవన్ కల్యాణ్ కోరారు. 'ఐదేళ్ల వైసీపీ పాలనలో తణుకు అభివృద్ధి చెందలేదు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశాలు వున్నా అధికార పార్టీ నేతలు పట్టించుకోలేదు. అవినీతిపైనే ఆధారపడ్డారు. అవినీతి మార్గాలతో ఇక్కడ సంపాదించిన డబ్బును తండ్రీ, కొడుకులు హైదరాబాద్‌లో పెట్టుబడి పెట్టి పరిశ్రమలను స్థాపించారు. అదే ఇక్కడ పెడితే కనీసం యువతకైనా ఉద్యోగాలు వచ్చేవి. అవినీతి డబ్బుతో తండ్రీ, కొడుకులు ఎన్నికల్లో పోటీ పడుతున్నారు. ఇద్దరినీ చిత్తుగా ఓడించాలి. జగన్, మంత్రి, కొడుకులు ఎంతగా దోపిడీ చేస్తున్నారో అందరికీ తెలుసు. వారిని రానున్న ఎన్నికల్లో గోస్తనీ నదిలో కలిపేయాలి' అంటూ పవన్ కల్యాణ్ ఘాటుగా స్పందించారు. ఎర్రకాలువ అభివృద్ధితోపాటు, ప్రతి ఎకరానికి సాగు నీరు అందించడానికి, తణుకు పట్టణాన్ని పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దడానికి, నియోజకవర్గ అభివృద్ధికి ఆరిమిల్లిని గెలిపించాలి' అని విజ్ఞప్తి చేశారు.

పులకించిన తణుకు

చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రజాగళం సభ సూపర్ సక్సెస్ అయ్యింది. తణుకు పట్టణంలోని రోడ్లన్నీ జనసంద్రంగా మారింది. బుధవారం మధ్యాహ్నం నేతలు ఇద్దరూ వేర్వేరు హెలికాప్టర్‌లలో తణుకు వచ్చారు. హెలీ ప్యాడ్ నుంచి ఇద్దరూ ఒకే కాన్వాయ్‌లో రాష్ట్రపతి రోడ్డు మీదుగా నరేంద్రసెంటర్ చేరుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా వున్న అశేష ప్రజలకు అభివాదాలు చేశారు.


దారి పొడవునా..వెయ్.. దరువెయ్

రహదారి పొడవునా టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, అభిమానులు మూడు పార్టీల జెండాలతో నినాదాలు చేశారు. సభ ప్రాంగణం వద్ద రోడ్లన్నీ జనంతో నిండిపోయాయి. చంద్రబాబు, పవన్ ప్రసంగాలు పూర్తయ్యే వరకు ఏ ఒక్కరూ కదలకపోవడం విశేషం. తణుకులో నేతలు ఇద్దరూ తొలిసారిగా రోడ్ షో, సభ నిర్వహించడం, అది సూపర్ సక్సెస్ కావడంతో కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపైంది. సభ ప్రారంభం కాక ముందు విడివాడ అభిమానులు కొందరు ప్లకార్డులతో రావడంతో టీడీపీ కార్యకర్తలు అభ్యంతరం తెలిపారు. ఇరువురి మధ్య వాగ్వాదం జరగడంతో పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.


ఎటు చూసినా జన ప్రవాహం


చిన్నారుల నుంచి యువత వరకు అభిమాన తరంగం


యువత సమరోత్సాహం


మహిళల విజయకేతనం

91001 21271

- తాగునీటి ఎద్దడి ఉంటే ఫోన్ చేయండి
- పూర్తిస్థాయిలో తాగునీటి చెరువులకు నీళ్లు
- కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్


కలిదిండిలో అడుగంటిన తాగునీటి చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

కలిదిండి, ఏప్రిల్ 10 : 'వేసవి దృష్ట్యా అడుగంటిన తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని అధికారులను ఆదేశించాం. ఎక్కడైనా తాగునీటి ఎద్దడి ఉంటే 91001 21271కు కాల్ చేయండి. ప్రతీరోజు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉంటారు.' అని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ స్పష్టం చేశారు. 'మూడు రోజులకొకసారి కుళాయి" శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురిత మైన కథనంపై కలెక్టర్ స్పందించి కలిదిండిలో అడుగంటిన తాగునీటిని చెరువును, సీబీ కెనాల్‌లో తాగునీటి సరఫరాను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 'పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువును పూర్తిస్థాయిలో నింపే వరకు తాగునీటి వంతు సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. లంక గ్రామాల్లో అన్ని తాగునీటి చెరువులను పూర్తిగా నింపుకోవాలి. కాల్వల్లో నీటిని చేపల, రొయ్యల చెరువులకు మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం' అన్నారు. అనంతరం పోలరాజ్ కెనాల్‌ను పరిశీలించి మాట్లాడుతూ 'కైకలూరు నియోజకవర్గంలో 158 చెరువుల్లో నీరు నింపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రెండు రోజుల్లో పోలరాజ్ కెనాల్‌కు తాగునీరు విడుదల చేస్తారు. జిల్లాలో ఆగడాల లంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాల్లో తాగునీటి చెరువులకు గోదావరి నీటిని విడుదల చేశాం. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేశాం' అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.వి. సత్యనారా యణ, డీఈఈ ఎం.శాస్త్రి, ఇరిగేషన్ ఏఈ సిద్ధార్థ, ఆర్డీవో ఖాజావలి, తహసీల్దార్ దశిక వంశీ, ఎంపీడీవో దినతేజ్, ఈవోపీఆర్డీ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

'టోఫెల్' టాపర్లకు.. మొండిచెయ్యి!

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆంగ్లభాషపై పట్టు సాధించేలా తర్ఫీదు నిస్తున్నట్టు గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్రప్రభుత్వం ఆ దిశగా సామర్థ్యాలను నిరూపించుకున్న బాల బాలికలను ప్రోత్సహించడంలో ఆసక్తి కనబరచడంలేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంలో నిపుణతకు ప్రారంభించిన 'టోఫెల్' (టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ యాజ్ ఏ ఫారిన్ లాంగ్వేజ్) శిక్షణ పొందిన విద్యార్థుల్లో 3-5 తరగతుల బాల లకు

జిల్లాలో బుధవారం మూడో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 340 ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన 'టోఫెల్' పరీక్షకు 20 వేల మంది హాజరయ్యారు. మిగతా తరగతుల విద్యార్థులను కలిపితే సుమారు 40 వేల మందికి పైగా బాలబాలికలు ఉంటారు. పరీక్ష నిర్వహణ తీరును డీఈవో అబ్రహం ఉంగుటూరు మండలం గొల్లగూడెం జడ్పీ హైస్కూలు పరీక్షా కేంద్రంలో పరిశీలించారు. జవాబు పత్రాల మూల్యాంకనం పదిరోజుల్లో జరగనుంది. ఇక ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 12న పరీక్ష జరుగుతుంది. ఆన్సర్ స్క్రిప్టులను మూల్యాంకనం చేసిన తర్వాత అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు నిర్ధారణ అవుతుంది. ఈ ప్రక్రియంతా ఈ నెల 22లోగా ముగుస్తుంది. 'టోఫెల్' టాపర్లను పక్కన పెట్టి టీచర్లను మాత్రమే అమెరికా టూర్‌కు పంపనుండటం విశ్లేషిస్తే 'విన్నర్'ను విస్మరించి 'కోచ్'కు కప్పుని అందించినట్టుగా ఉందన్న విమర్శలొస్తున్నాయి.

40 వేల మందికి పైగా టోఫెల్ విద్యార్థులు

- 52 మంది టీచర్లకు మాత్రమే అమెరికా టూర్

బుధవారం పరీక్షను నిర్వహించగా, ఈనెల 12న 6-9 తరగతుల విద్యార్థులకు పరీక్ష జరగాల్సి ఉంది. అంగ్లం సబ్జెక్టు పాఠ్యాంశాలపై విద్యార్థుల రీడింగ్, లిజనింగ్ స్కిల్స్‌ను ఈ పరీక్షలో మదింపుచేస్తారు. ప్రతిభ కనబరిచిన లేదా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు తర్ఫీదు నిచ్చిన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులను ప్రోత్సహించేందుకు అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీకి ప్రభుత్వ ఖర్చులతో పంపించడానికి నిర్ణయించిన ప్రభుత్వం సంబంధిత ప్రతిభావంతులైన విద్యార్థులను విస్మరించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. అసలే ప్రభుత్వ విధానాలతో విసుగెత్తుతున్న టీచర్లను ప్రస్తుత ఎన్నికల్లో మచ్చిక చేసుకునే పన్నాగాల్లో ఇదొకటనే ఆరోపణలూ లేకపోలేదు.

ప్రతిభావంతులకు ఇదేనా ప్రోత్సాహం ?

కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల బాలబాలికలు ఇంగ్లీషులో సామర్థ్యాలు సాధించడం తద్వారా ఉన్నత చదువులు, కొలువుల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్న ఆశయంతో ప్రభుత్వం 'టోఫెల్' తర్ఫీదును అందుబాటులోకి తెచ్చింది. దీనికనుగుణంగానే ప్రభుత్వ పాఠశాలల్లో


గొల్లగూడెం జడ్పీ హైస్కూలులో 'టోఫెల్' పరీక్ష నిర్వహణతీరుని పరిశీలిస్తున్న డీఈవో అబ్రహం

ఇంగ్లీషు సబ్జెక్టు టీచర్లతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, శిక్షణ, పుస్తకాలతో తర్ఫీదునిప్పిస్తోంది. ఆ మేరకు బాల బాలికలు వార్షిక పరీక్షల్లో ఆంగ్లభాషపై ఎంతపట్టు సాధించారో మదింపు చేసేందుకు పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ పరీక్షల్లో అత్యధిక మార్కులు లేదా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడంలో మాత్రం విస్మరించింది. ఆ ప్రకారం విద్యార్థులు రాసిన 'టోఫెల్' పరీక్షల్లో తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకుని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు మొండిచేయి చూపుతూ, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయులను మాత్రం ప్రభుత్వ ఖర్చులతో అమెరికా టూర్ పంపడానికి సిద్ధమైంది. ఈ మేరకు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్ల నుంచి రాష్ట్రంలో మొత్తం 52 మంది ఉపాధ్యాయులను ఎంపికచేసి ఈ ఏడాది మే నెలలో పంపనున్నారు. వీరికి ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో అంగ్లం సబ్జెక్టు/టోఫెల్‌లో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ వారం రోజులపాటు ఇస్తారు. ఈ టూర్‌కు టోఫెల్ టాపర్లను కూడా పంపిస్తే వారికి ప్రోత్సాహకరంగా ఉండటంతో పాటు, మిగతా విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని ఉపాధ్యాయ వర్గాలే చెబుతుండడం గమనార్హం. గతేడాది టోఫెల్ టాపర్ల (విద్యార్థులు)ను కూడా అమెరికా టూర్ పంపిన ప్రభుత్వం ఈ ఏడాది కేవలం ఉపాధ్యాయులనే ఎంపిక చేయడంపై ఉపాధ్యాయులే పెదవి విరుస్తున్నారు. విద్యార్థు లను అమెరికా టూర్ పంపే విషయమై ఇంతవరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని, కేవలం ఉపాధ్యాయు లను పంపడానికి కసరత్తు జరుగుతోందని విద్యాశాఖ వర్గాలు స్పష్టం చేశాయి.

• నేడు రంజాన్



ముస్లింలు పవిత్రంగా నిర్వహించుకునే రంజాన్ పండుగకు జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదులు ముస్తాబయ్యాయి. రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

1,757 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : జేసీ

ఏలూరు సిటీ, ఏప్రిల్ 10 : జిల్లాలో రబీ పంటకు సంబంధించి ఇంతవరకు 1,757 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు జేసీ లావణ్యవేణి తెలిపారు. రబీ పంట కాలానికి సంబంధించి 120 ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అందుకు కావాల్సిన సౌకర్యాలు, సిబ్బందిని నియమించామన్నారు. ఇప్పటి వరకు 108 మంది రైతులకు సంబంధించి 1,757 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా , అందులో 44 మందికి చెందిన 302 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అనుసంధానం చేయబడిన రైస్ మిల్లులకు ర్యాండమ్ సెలక్షన్ ద్వారా తరలించారన్నారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా తేమశాతం 16 నుంచి 17 శాతం ఉండేలా ఉన్న కామన్ రకం క్వింటాలుకు రూ. 2,183, గ్రేడ్-ఏ రకం క్వింటాలుకు రూ. 2,203 చెల్లిస్తు న్నట్టు తెలిపారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, బయోమెట్రిక్ విధానంలో రైతులు తమ వేలిముద్రను వేసి ప్రభుత్వానికి విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న కార్యదర్శి గాదిరాజు బాబు, పాండురంగరాజు

రోప్ స్కిప్పింగ్‌లో డీఎన్నార్ విద్యార్థుల ప్రతిభ

భీమవరం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 : భోపాల్‌లో జరిగిన ఆల్ ఇండియా అంతర్ యూనివర్సిటీల రోప్ స్కిప్పింగ్ పోటీల్లో డీఎన్నార్ కళాశాల విద్యార్థులు మూడు బంగారు పతకాలు, రెండు రజిత పథకాలు సాధించినట్లు కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) తెలిపారు. బుధవారం కళాశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం జరిగింది. నన్నయ్య యూనివర్సిటీ తరుపున పాల్గొని బహుమతులు సాధించారన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్, నన్నయ్య యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ టీం కోచ్‌గా వ్యవహరించిన డాక్టర్ నరసింరాజు మాట్లాడుతూ 37 యూనివర్సిటీల నుంచి క్రీడాకారులు రాగా మన విద్యార్థులు మూడు బంగారు పతకాలు, 2 రజిత పతకాలు, మహిళలు ఒక రజిత పతకం సాధించారని తెలిపారు. ఏవో రామకృష్ణంరాజు, పీడీ శేఖర్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

15న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరుసిటీ, ఏప్రిల్ 10: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జిల్లా ప్రజాపరిషత్ సమావేశాలు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈనెల 15 వతేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్టు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కెఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు. జిల్లాలో అమలు జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు.

13 నుంచి ఆశ్రం కళాశాలలో గేమ్స్ మీట్

ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 10:ఏలూరు ఆశ్రం కళాశాలలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు దంత కళాశాల విద్యార్థులకు డాక్టర్ వైఎస్సార్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ 24వ ఇంటర్ కాలేజియేట్ గేమ్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ వైఎస్ఆర్ యూని వర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, విజయవాడకు అనుబంధంగా ఉన్న కళాశాలలు విద్యార్థులకు వాలీబాల్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్,త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, చదరంగం పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ మీట్‌లో 25 మెడికల్, డెంటల్ కాలేజీలు పాల్గొంటున్నాయన్నారు. ఈ మెగా ఈవెంట్‌లో దాదాపు 600 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

పితాని విజయం కోరుతూ కళాకారుడి ప్రచారం



ఆచంట, ఏప్రిల్ 10: ఆచంట నియోజకవర్గం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పితాని సత్యనారాయణను గెలిపించాలని కోరుతూ జానపద విభాగం కళాకారుడు అయిన మిరియాల సిద్ధయ్య తమ వాహనంపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుని ప్రచారం చేస్తూ పలువురిని ఆకర్షిస్తున్నాడు. ఈ ప్రచారంలో బాబు గ్యారెంటీ, భవిష్యత్తు గ్యారెంటీ.. సూపర్‌సిక్స్ వంటి పథకాలపై గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నాడు. గత కొన్ని సంవత్సరాలగా టీడీపీపై అభిమానంతో ఎన్నికల సమయంలో ఇలా ప్రచారం నిర్వహిస్తున్నట్లు సిద్ధయ్య తెలిపారు.

చెరువుల్లో మోటార్ల తొలగింపు



భీమడోలు, ఏప్రిల్ 10: ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాల్లో చెరువుల్లో ఏర్పాటు చేసిన నీటి సరఫరా మోటార్లను అధికారులు బుధవారం తొలగించారు. తాగునీటి చెరువుల్లో మోటార్లు ఏర్పా టుచేసి చేపల చెరువులకు నీటిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటా మని తహసీల్దార్ వరహాలయ్య అన్నారు. ఎంపీడీవో స్వర్ణకుమారి, తహసీ ల్దార్ వరహాలయ్య, అటవీ శాఖ, విద్యుత్ శాఖ అధికారులు తనిఖీ నిర్వహించి అక్రమ మోటారు కనెక్షన్లను తొలగించారు. భవిష్యత్తులో మళ్లీ మోటారు ఏర్పాటు చేస్తే వారిపై కేసులు పెడతామని హెచ్చరించారు.

కాంతారావుకు చిత్ర కళానిధి పురస్కారం


బిరుదు ప్రదానం చేస్తున్న అంబికా అధినేతలు

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 10: చిత్రకళకు విశేష ప్రాచుర్యం కల్పిస్తున్న ఏలూరువాసి మజ్జి కాంతారావు ధన్యుడని మాజీ ఎమ్మెల్యే, అంబికా గ్రూప్ సంస్థల అధినేత అంబికా కృష్ణ అన్నారు. స్నేహం అసోసియేషన్ వార్షికోత్సవం అంబికా భవన్‌లో బుధవారం నిర్వహించారు. జాతీయస్థాయిలో పేరొందిన చిత్రకళాకారుడు మజ్జి కాంతారావుకు చిత్ర కళానిధి బిరుదు ప్రదానం చేశారు. ఎంతోమందిని చిత్ర కళాకారులుగా తీర్చిదిద్దిన కాంతారావును అభినందించారు. స్నేహమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు అంబికా రాజా మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా ఏటా ప్రము ఖులకు పురస్కారాలు అందజేస్తున్నామని తెలిపారు. అంబికా ప్రసాద్, కళారత్న కేవీ.సత్యనారాయణ, ఆడిటర్ జి.రాధాకృష్ణ, రచయిత గురుశర్మ, గాయకులు కేఎల్‌వీ.నరసింహం, పలువురు సాహితివేత్తలు, కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.


ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న సారా, బెల్లపుఊట

20 లీటర్ల సారా స్వాధీనం.. 1500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 10 : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావుల ఆదేశాల మేరకు అధికారులు బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు.టి.నర్సాపురం మండలం బంధంచర్లలో సారా బట్టీలపై దాడి చేసి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 1500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.ఎస్ఈబీ డీఎస్పీ జనార్ధన్ నాయుడు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఇంటిలిజెన్స్ ఎస్ఐ మురళీధర్, ఏఎస్ఐ పూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు

10-04-2024 పొగాకు ధరలు (రూ.)	పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
	దేవరపల్లి	242	225	235.57
	జంగారెడ్డిగూడెం-1	242	235	240.23
	జంగారెడ్డిగూడెం-2	242	235	239.81
	కొయ్యలగూడెం	244	235	240.04
	గోపాలపురం	243	235	239.89



చల్ల..చల్లగా

మట్టి కుండలకు గిరాకీ

ఏలూరు సిటీ, ఏప్రిల్ 10 : రోజురోజుకీ ఎండలు మండుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండ తీవ్రత తారస్థాయికి చేరింది. వేడి నుంచి ఉపశమనం కోసం చల్లగా తాగాలనిపిస్తుంది. ఫ్రిజ్‌లో నీరు తాగితే రొంప, దగ్గు వేదిస్తున్నాయి. దీంతో చాలా మంది మట్టి కుండలను వినియోగిస్తున్నారు. కుండలో నీరు తాగితే ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవనే భావనతో మట్టి కుండలు కొనుగోలు చేస్తుండడంతో వాటికి డిమాండ్ పెరిగింది. ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు తదితర ప్రాంతాల్లో ఈ మట్టి కుండల అమ్మకాలు జరుగుతున్నాయి. డిమాండ్‌ను బట్టి ధరలు కూడా ఏడాది కేడాదికి పెరుగుతూనే ఉన్నాయి.ఏలూరు ఆర్అండ్‌బీ కార్యాలయం సెంటర్‌లో ఈ మట్టి కుండల అమ్మకాలు జరుగుతున్నాయి. ఒక్కో కుండ రూ.250 పైగానే ధర పలుకుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.200 నుంచి ధరలు ఉన్నాయి. వివిధ రంగులతో అందమైన ఆకృతులతో ఈ కుండలను తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారు. ఈసారి కుండలు అమ్మకాలు పెరిగాయని అమ్మకందారులు చెబుతున్నారు.






ఏలూరులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కుండలు

ఈద్ ముబారక్

నేడు రంజాన్

గణపవరం, ఏప్రిల్ 10 : ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే రంజాన్ పండుగకు అంతా సిద్ధమైంది. సుమారు నెలరోజుల పాటు కఠిన నిబంధనలతో ఉపవాస దీక్షలో పాల్గొన్న ముస్లింలు గురువారం రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) పండుగను ఇంటింటా ఘనంగా జరుపుకోనున్నారు. గల్ఫ్‌దేశాల్లో మంగళవారం నెలవంక దర్శనమివ్వడంతో బుధవారం రంజాన్ జరుపుకున్నారు. మరుసటి రోజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ భక్తి భావాన్ని చాటుకోనున్నారు. గణపవరం పెద్ద మసీదులో విద్యుత్ దీపాలతో అలంకరణలు చేశారు. రంజాన్‌మాసం హృదయ సంస్కరణకు దోహదపడే మాసంగా ముస్లింలు తమ హృదయాల్లో అల్లాను నింపుకుని ప్రార్థనలు చేస్తారు. మహ్మద్ ప్రవక్త హజరత్ మహ్మద్ ఏడాదిలోని 12 మాసాల్లో ఒక మాసం సానుభూతి చూపాలని వేడుకున్నారు. ముఖ్యంగా హిందువులను కూడా ఈ పండుగకు ఆహ్వానించి పసందైన వంటకాలు వడ్డిస్తారు. సర్వమత సమ్మేళనానికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుంది. ఈద్ నమాజ్ ముందే ముస్లింలు ఫిత్రా చెల్లిస్తారు. ధనిక,పేద అనే తేడా లేకుండా ఫిత్రా చెల్లించాలి. స్థితిమంతులు తాము సంపాదించిన దానిలో తోచినంత పేదవారికి దానం చేయడం వలన అల్లా ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఆ కుటుంబం ఉంటుందని నమ్మకం. ఈద్గాకి వెళ్లేటప్పుడు ఒకదారి తిరిగి వచ్చేటప్పుడు మరోదారిలో రావడాన్ని ఉత్తమంగా భావిస్తారు. నమాజ్ ముగిసిన తరువాత ఇమామ్ ఉపదేశాన్ని ఇస్తారు. దీక్షలో ఆటంకం లేకుండా ముగిస్తే అల్లాకు కృతజ్ఞతలు తెలుపుతూ నమాజ్ చేస్తారు.

మసీదులు ముస్తాబు

ఏలూరు కల్చరల్ : రంజాన్ పండుగకు అన్ని మసీదులు ముస్తాబయ్యాయి. పట్టణాలు, గ్రామాల్లోని మసీదులన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్ని మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లకు ఏర్పాట్లు చేశారు. పండుగ పురస్కరించుకుని బుధవారం ఏలూరు నగరంలోని దుకాణాలు కిటకిటలాడాయి. ముస్లింలు ఎక్కువగా నివసించే అన్ని కాలనీలు పండుగ శోభను సంతరించుకున్నాయి.కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ముస్లింలు ఆనందోత్సాహాలతో, భక్తి శ్రద్ధలతో పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆ అల్లా దీవెనలు ఎప్పుడూ మీపై ఉండాలని ఆకాంక్షించారు.




గణపవరం, భీమవరంలో ముస్తాబైన మసీదులు

రంజాన్ తోఫాను అటకెక్కించారు

వైసీపీ అధికారంలోకి రాగానే సరుకులు నిలిపివేత

పండుగకు దూరమవుతున్న పేద ముస్లింలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 10: రంజాన్ తోఫా..ఈ పేరు వింటే ముస్లీంలకు ఎనలేని ఆనందం. పేద ముస్లీంలు పండుగకు పస్తులు ఉండకూడదనే ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు చంద్రన్న రంజాన్ తోఫాను తీసుకువచ్చారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న ముస్లింలకు సుమారు రూ.400 విలువచేసే పండుగ సరుకులను రేషన్ ద్వారా ఉచితంగా అందించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని అటకెక్కించింది సంక్రాంతి, క్రిస్మస్ కానుకలు కూడా అందించేవారు. వాటికీ మంగళం పాడేశారు.ప్రస్తుతం రంజాన్ పండుగ వస్తోంది. టీడీపీ హయాంలో రంజాన్ తోఫా తీసుకుని పండుగ సంతోషంగా చేసుకునేవారమని ఇప్పుడు ప్రభుత్వం ఏ విధమైన సరుకులు ఇవ్వడం లేదని పలువురు ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంజాన్ తోఫాతో పాటు క్రిస్మస్, సంక్రాంతి కానుకలు కూడా రద్దు చేయడంతో ఎంతోమంది పండుగలకు దూరమవుతున్నారు. చేతిలో చిల్లిగవ్వలేకపోయినా రంజాన్ తోఫాతో పండుగ చేసుకునేవారమని ముస్లీమ్‌లు పేర్కొంటున్నారు. వైసీపీ అధికారం చేపట్టాక పథకాలను తీసివేయడంతో పండుగ చేసుకునేందుకు ఇబ్బంది పడుతున్నామన్నారు. టీడీపీ హయాంలో పండుగకు సరుకులు ఇచ్చేవారు. కొత్తవస్త్రాలు లేకపోయినా ప్రభుత్వం ఇచ్చే కానుకలతోనే పండుగ చేసుకునే వారమని వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్ళలో ఒక్కసారి కూడా ఏ సాయం లేదని వాపోతున్నారు.



పేద ముస్లింల పొట్టకొట్టారు



వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లీమ్, మైనార్టీలపై అణచివేత ధోరణి ప్రదర్శిస్తోంది. వారికి అందాల్సిన సంక్షేమ పథకాలను రద్దుచేసింది. కార్పొరేషన్ ద్వారా అందాల్సిన సబ్సిడీ రుణాలను రద్దుచేసింది. మహిళలకు అందించే ఉచిత కుట్టుమిషన్‌లు తీసివేసింది. ప్రతి పేద, ముస్లీమ్ రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని చంద్రబాబు ప్రవేశపెట్టిన రంజాన్ తోఫాను ఈ ప్రభుత్వం దూరం చేసి వారి పొట్టకొట్టింది. ప్రస్తుతం సరుకులు, వస్త్రాల ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ క్రమంలో పండుగ చేసుకోవాలంటే భారంగా మారింది. రంజాన్ తోఫాను కొనసాగించి ఉంటే బాగుండేది.

-ఎండీ ఇక్బాల్, టీడీపీ ముస్లిం నాయకుడు

పంట అమ్మేదెలా ?



వైసీపీ ప్రభుత్వ విధానాలతో రైతుల్లో ఆందోళన

గడిచిన పంటల్లో ధరలో కోత .. సొమ్ము జాప్యం

ఈ ఐదేళ్లలో నానా అవస్థలు

ఈ ఏడాదైనా సజావుగా సాగేనా

భీమవరం రూరల్, ఏప్రిల్ 10 : దాళ్వా పంట పండింది.. పంట కూడా కోసి చేతికి వచ్చింది. అయితే రైతుల్లో ఇప్పుడే భయం మొదలైంది.. ధాన్యం కొనుగోళ్లలో వైసీపీ ప్రభుత్వ విధానాలను తలచుకుని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట ఎంత బాగా పండినా ఎన్ని కేజీలు కోత కోస్తారో ? ధాన్యం సొమ్ము ఎప్పుడు ఇస్తారో అనే అనుమానాలు వెంటాడతున్నాయి . టీడీపీ ప్రభుత్వం హాయంలో మంచి ధర వచ్చేది.. సొమ్ము త్వరగా ఇచ్చేవారు. ఈ ఐదేళ్ళలో వైసీపీ ప్రభుత్వం రైతులకు చుక్కలు చూపించింది. సాగు చేయాలంటేనే భయపడే పరిస్థితికి రైతులు వచ్చారు. జిల్లాలో ఈ దాళ్వాలో 2 లక్షల 50 వేల ఎకరాలలో సాగు సాగాల్సి ఉండగా 2 లక్షల 25 వేల ఎకరాలలో మాత్రమే సాగింది.

ఎకరానికి రూ.10 వేలు పైగా నష్టం

గత పంటకాలానికి ధాన్యం అమ్మకంలో ప్రభుత్వం విధివిధానాలతో రైతులు అవస్థలతో పాటు ధరలో నష్టం చవిచూడాల్సి వచ్చింది. ధాన్యం అమ్మకానికి సంచులు గురించి పడిగాపులు పడ్డారు. ధాన్యం అమ్మిన తరువాత నెలలు తరబడి ధాన్యం సొమ్ములు కోసం వేచి చూశారు. గడిచిన దాళ్వా, సార్వా పంటలలో ఎకరానికి రూ.10 వేలు పైనే నష్టం చూడాల్సి వచ్చింది. బస్తాకు 5 కేజీల నుంచి 10 కేజీల వరకు మిల్లర్లు కోత కోశారు ఈ దాళ్వా పంట ఏమవుతుందోననే భయం రైతులను వెంటాడుతోంది. అంతేకాకుండా ధాన్యం సొమ్ము ఆలస్యమైతే రైతులకు పెట్టుబడి సొమ్ముకు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. ప్రతీ పంటలోను జాప్యం కారణంగా వడ్డీ రూపంలో నష్టం భరిస్తున్నారు.



ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం..

దాళ్వా పంట ధాన్యం కొనుగోలు మొదలైంది. జిల్లాలో 306 ఆర్బీకేలలో క్లస్టర్ వారీగా 266 ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేశారు. 11 ఆర్బీకేలలో కొనుగోలు మొదలైంది. గణపవరం, నర్సాపురం, పెనుమంట్ర, తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతాలలో 1182 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలో 2 లక్షల 25 ఎకరాలలో దాళ్వా సాగు సాగగా 9 లక్షల 18 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేశారు. 7 లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయాలని ప్రాథమికంగా అంచనా వేశారు.

క్రైం కార్నర్

పురుగుల మందు తాగి యువకుడి మృతి

లింగపాలెం, ఏప్రిల్ 10: లింగపాలెం మండలం సుందర్‌రావుపేట గ్రామానికి చెందిన జూట్రు మారేష్ (30) పురుగుమందు తాగి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మారేశ్వరరావు పొలం పనులకు వెళ్లి అక్కడ పురుగు మందు తాగాడు. పొలం యజమాని గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు లింగపాలెంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెన్నారావు తెలిపారు.

హాంకాంగ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.6 లక్షలకు టోకరా

ఏలూరు క్రైం, ఏప్రిల్ 10 :హాంకాంగ్ దేశంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి మోసగించిన వ్యక్తిపై ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. విశాఖపట్నంలోని గోపాలపట్నం ప్రాంతానికి చెందిన దివ్వెల లక్ష్మణరావు ఏలూరు సమీపంలోని సత్రంపాడు ఎమ్మార్పీ కాలనీకి చెందిన శ్రవణం సునీల్ కుమార్‌కు పరిచయమయ్యాడు హాంకాంగ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని లక్ష్మణరావు మాయమాటలు చెప్పి సునీల్ కుమార్ నుంచి దఫదఫాలుగా రూ.6 లక్షలు తీసుకొని మోస గించాడు. బాధితుడు బుధవారం రాత్రి ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 10 : అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న ఒక వ్యక్తిపై జిల్లా ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ కేసు నమోదు చేశారు. కుక్కునూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు తన ఇంటికి అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్నారు. తనిఖీలు చేసి అతనిపై కేసు నమోదు చేశారు. 56,396 రూపాయలు అపరాధ రుసుం విధించారు. నాలుగు వేల రూపాయలు జరిమానా వేశారు.

వ్యవసాయ బోర్ల సామగ్రి చోరీ

ముసునూరు, ఏప్రిల్ 10: ముసునూరు మండలం గోపవరం శివారు పెద్దపాటివారిగూడెంలో మంగళవారం రాత్రి వ్యవసాయ బోర్ల కేబుల్ వైర్లు, స్టార్టర్లు, ఫ్యూజులకు ఉన్న రాగి వైర్లు చోరీకి గురయ్యాయి. సుమారు 36 మంది రైతులకు చెంది 40 వ్యవసాయ బోర్ల సామాగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. వీటి విలువ రూ.208 లక్షలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.


కరుగోరుమిల్లిలోని ఇసుక ర్యాంపులో నిలిచి ఉన్న ట్రాక్టర్లు

కేసూ లేదు.. ట్రాక్టర్ల జాడ లేదు

పోలీసులకు అప్పగించామంటున్న రెవెన్యూ అధికారులు

ఖాళీ ట్రాక్టర్లపై కేసెలా పెడతామన్న పోలీసులు

మందుగుండు సామాగ్రి కాల్చిన అక్రమ రవాణాదారులు

పాలకొల్లు, ఏప్రిల్ 10: ఆచంట మండలం కరుగోరుమిల్లి ఇసుక ర్యాంప్‌లో మంగళవారం ఇసుక అక్రమ రవాణాను స్థానికులు నిలుపుదల చేశారు. ఒక ఎక్స్‌కవేటర్, సుమారు 10 ట్రాక్టర్లను అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ర్యాంప్ వద్దకు వెళ్లి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే మంగళవారం రాత్రికి ర్యాంపు నుంచి ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు మాయం అయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం సంఘటన జరగ్గా రాత్రి 10 గంటల సమయానికి ఇసుక అక్రమ రవాణాదారులు అక్కడ నుంచి దుకాణం సర్దేశారు. ట్రాక్టర్లను ఏం చేశారని ఆచంట తహసీల్దార్‌ను వివరణ కోరగా వాటిని ఆచంట పోలీసులకు అప్పగించామని తెలిపారు. మైనింగ్ అధికా రులకు సమాచారం ఇచ్చినట్టు చెబుతున్నారు. అయితే పోలీసులు దీనిపై కేసు నమోదు చేయలేదు. ఖాళీ ట్రాక్టర్లపై కేసు నమోదు చేయడం సాధ్యం కాదని, ఇసుక ఉంటేనే కేసు పెట్టే వీలు ఉందని ఆచంట పోలీసులు వింత వాదనలు వినిపించడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆధారాలతో పట్టి ఇచ్చిన ట్రాక్టర్లను వదిలి వేయడంపై గ్రామస్థులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్ అధికారులను వివరణ తీసుకోవడానికి ప్రయత్నించగా సంబధిత అధికారులు స్పందించడం లేదు. ఇదిలా ఉంటే అధికార పార్టీ నాయకుల అండదండలతో కేసులు లేకుండా బైటకు వచ్చేసిన పలువురు ట్రాక్టరు యజమానులు మంగళవారం రాత్రి కరుగోరుమిల్లి శివాలయం ప్రాంతంలో పెద్ద ఎత్తున మందుగుండు సామాగ్రి కాల్చి పండుగ చేసుకున్నారు. తమను ఎవరూ ఏమీ పీకేది లేదని బాహాటంగా చెప్పడం గమనార్హం. ట్రాక్టర్లను సీజ్ చేసి అక్రమ ఇసుక రవాణాదారులపై కేసు నమోదు చేయకుంటే ఆచంట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని కరుగోరుమిల్లి గ్రామస్థులు చెబుతున్నారు.


రాజీనామా పత్రాలు చూపుతున్న పి.కన్నాపురం వలంటీర్లు

108 మంది వలంటీర్లు రాజీనామా

భీమడోలు ఏప్రిల్ 10: వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు రాజీనామాలు చేశారు. భీమడోలు మండలం పలు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న 23 మంది గ్రామ వలం టీర్లు బుధవారం తమ రాజీనామా పత్రాలను అధికారులకు అందజేశారు. భీమడోలు, ఆగడాలలంక, పోలసానపల్లి తదితర గ్రామాల్లో పనిచేస్తున్న వలంటీర్లు ఆయా గ్రామ పంచాయతీలు, సచి వాలయ అధికారులకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

ఉంగుటూరు : ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో ఎనిమిది మంది, బొమ్మిడిలో ఒకరు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో శర్మ తెలిపారు.

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురంలో బుధవారం 14 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి సప్తగిరికి అందించారు.

ఆకివీడు :ఆకివీడు సచివాలయం-2కు చెందిన తొమ్మిది మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు.

ఆచంట : పెనుమంచిలిలో మరో ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్ తెలిపారు.మండలంలో 290 మంది వలంటీర్లకు ఇప్పటి వరకు 234 మంది రాజీనామా చేశారు.

ముసునూరు : ముసునూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన 29 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో పద్మావతి దేవికి అందజేశారు. మొత్తం 35 మంది వలంటీర్లకు ఉండగా సచివాలయం-1 పరిధిలో 18 మందికి 17 మంది, సచివాలయం-2 పరిధిలో 17 మందికి 12 మంది రాజీనామాలు చేశారు.

నూజివీడు టౌన్ :నూజివీడు పట్టణం 1వ వార్డుకు చెందిన 14 మంది వలంటీర్లు తమ రాజీనామాలను నూజివీడు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డికి అందించారు.

ఆగిరిపల్లి :ఆగిరిపల్లి మండలం ఈదులగూడెంలో బుధవారం 8 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వీరితో ఇప్పటికి మండల వ్యాప్తంగా 13 మంది రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు.


పోలసానపల్లిలో సచివాలయ అధికారులకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు


గణపవరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎఫ్ఎస్‌టీ బృందం

ఎన్నికల తనిఖీలు.. రూ 4.11 లక్షలు సీజ్

చింతలపూడి/గణపవరం ఏప్రిల్ 10: చింతలపూడి మండలం రాష్ట్ర సరిహద్దు అల్లిపెల్లి చెక్‌పోస్ట్ వద్ద పత్రాలు చూపని లక్షా 30 వేల నగదును ఎస్ఎస్ టీమ్ పట్టుకున్నట్లు సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ తెలిపారు. మోటారువాహనంపై వెళుతున్న వ్యక్తిని తనిఖీ చేయగా, ఎటువంటి పత్రాలు, అనుమతులు చూపకపోవడంతో ఈ నగదును స్వాధీనం చేసుకుని జిల్లా ట్రెజరీకి జమ చేసినట్లు తెలిపారు. గణపవరంలో బుధవారం ఎఫ్ఎస్‌టీ బృందం వాహనాలు తనిఖీ చేయగా అనుమతిలేని నగదు 2.81 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కొత్తూరు జూట్‌మిల్లు కార్మికులు

కొత్తూరు జూట్‌మిల్లు తెరిపించాలి : కలెక్టరేట్ వద్ద ధర్నా

ఏలూరు కలెక్టరేట్, ఏప్రిల్ 10: చట్టవిరుద్ధంగా మూసివేసిన కొత్తూరు జూట్ మిల్లును తెరిపించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ అనుబంధ హెచ్‌బీఎస్ జూట్ మజ్దూర్ యూనియన్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ జేసీ ఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి కె.పోలారి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, బద్దా వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులకు, కార్మిక సంఘాలకు ఎటువంటి సమాచారం లేకుండా జూట్‌మిల్లును మూసివేయడం సరి కాదన్నారు. 2500 మంది కార్మికులను రోడ్డు పాలు చేయడం అప్రజాస్వామికమని యాజమాన్యం తీరును తప్పుబట్టారు. కొత్తూరు మిల్లును రియల్‌ఎస్టేట్ వ్యాపారంగా మార్చుకునేవిధంగా యాజమాన్యం మూసివేతకు పాల్పడిందని ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకుని మిల్లు తెరిపించే ప్రయత్నాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కె.అప్పారావు, వై.శ్రీనివాస రావు, జి.రాంబాబు, ఎం.అప్పారావు, డి.వీరినాయుడు, క్రాంతి, అన్నవరం, సూరిబాబు పాల్గొన్నారు.

చీరవల్లిలో పలువురికి పునరావాస పరిహారం జమ

కుక్కునూరు, ఏప్రిల్ 10: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా ముంపు గ్రామాల్లో పలువురు నిర్వాసితులకు పునరావాస పరిహారం జమ అవుతోంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మార్చి నెల ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దాదాపు రూ.3.50 కోట్ల బడ్జెట్ మిగిలి ఉంది. ఆ నగదు నిర్వాసితుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. పునరావాస కాలనీలో ప్రభుత్వం ఇచ్చే ఇళ్లు వద్దనుకున్న వారికి రూ.2.80 లక్షలు, స్థలం కూడా వద్దనుకున్న వారికి రూ.3.80 లక్షలు నిర్వాసితుల ఖాతాలో జమ అవుతున్నాయి. మండలంలోని చీరవల్లిలో ఐదుగురికి, కివ్వాకలో ఇద్దరికి, కుక్కునూరులో ఇద్దరికి పరిహారం జమ కాగా వేలేరుపాడులో వ్యక్తిగత పునరావాస పరిహారం 50 మందికి నిర్వాసితులకు జమ అయినట్లు సమాచారం.

ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య సేవలు వినియోగించుకోవాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఐవో

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10: నగర పరిధిలో ప్రతీ బుధవారం నిర్వహించే ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగేశ్వరరావు సూచించారు. జ్వాలా పహరేశ్వరస్వామి కాలనీ, జేపీ కాలనీ అర్బన్ హెల్త్‌సెంటర్లలో ఆరోగ్య సురక్ష శిబిరాలను సందర్శించి సిబ్బందితో సమీక్షించారు. దాదాపు 63 రకాల వైద్య పరీక్షలు, నిపుణుల వైద్య సలహాలు, శస్త్రచికిత్సలకు రిఫరల్ ఆస్పత్రులకు పంపిచడం, తదితర సదుపాయాలు ఈ శిబిరాల్లో లభిస్తాయని విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఎముకల వైద్య నిపుణుడు ఏవీఆర్.మోహన్, మున్సిపల్ అదనపు కమిషనర్ చంద్రయ్య, వైద్యాధికారి నీలిమ, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, సిబ్బంది హైమావతి, శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెదడులో హార్మోన్ల లోపంతో పార్కిన్‌సన్



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ కీర్తి ప్రియాంక

ఏలూరు క్రైం, ఏప్రిల్ 10: మెదడులో హార్మోన్ల లోపం వల్ల వచ్చే వ్యాధి పార్కిన్‌సన్ అని ప్రభుత్వాసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.కీర్తి ప్రియాంక అన్నారు. దివ్యాంగుల పునరావాస కేంద్ర ఆధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రపంచ పార్కిన్‌సన్‌డే అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ పార్కిన్‌సన్ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందన్నారు. ఆకస్మికంగా మనిషి అవయవాలు పనిచేయకపోవడమే ఈ వ్యాధి లక్షణమన్నారు. శరీరంలో వణుకు, కండరాల్లో చురుకుదనం తగ్గడం, నోరు బిగుసుకుపోవడం, శరీరం అదుపు తప్పడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్ర సంస్థ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, వారి సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెదవేగి, ఏప్రిల్ 10: కనీస వయస్సు రాకుండా వివాహం చేస్తే కఠిన చర్యలు తప్పవని మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ కేపీవీఎల్.పద్మావతి హెచ్చరించారు. పెదవేగి గ్రామానికి చెందిన బాలికకు వివాహం చేస్తున్నారనే సమాచారంతో బుధవారం బాలిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో తల్లీబిడ్డలు ఇబ్బందులు పడతారన్నారు. బాల్య వివాహం చేస్తే కేసులు నమోదు చేస్తామని, జైలుశిక్షతో పాటు జరిమానా కూడా విధించే అవకాశాలు ఉన్నాయని ఆమె తెలిపారు. డీసీపీవో సీహెచ్.సూర్యచక్రవేణి మాట్లాడుతూ గడచిన రెండు రోజుల్లో 12 బాల్య వివాహాలను నిలుపుదల చేశామన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098, 9491063819 నంబర్లకు తెలియచేయాలని ఆమె సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.జ్యోతి పాల్గొన్నారు.

పరోపకారమే లక్ష్యంగా స్వచ్ఛంద సేవా సంస్థ



సేవాసంస్థను ప్రారంభిస్తున్న వాకర్స్

ఏలూరు రూరల్, ఏప్రిల్ 10: ప్రతిఒక్కరూ సమాజం కోసం పని చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు టి.హనుమంతరావు అన్నారు. పరోపకారమే లక్ష్యంగా వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవా సంస్థను హనుమంతురావుతో కలసి వ్యాపారి కేకే.గుప్తా, మోహన్‌గుప్తా వటూ ్లరులో బుధవారం ప్రారంభించారు. హనుమంతరావు మాట్లాడుతూ చదువు, రక్త, నేత్రదానం, ప్రమాద బాధితులకు సహాయం వంటి సేవా కార్యక్రమాల తో పాటుగా శిక్షణ, మోటివేషన్, కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు అధ్యక్షుడు తిరువీధి వేణుగోపాల్ తెలిపారు. సంస్థ ప్రారంభోత్సవం సందర్భంగా ఒక విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందజేశారు. నాగసూరి మురళీమోహన్ రావు, ఊటుకూరి కిరణ్, జూలూరి కాశీవిశ్వనాథం, టి.వరలక్ష్మి పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

టి.నరసాపురం, ఏప్రిల్ 10: సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం టి.నరసాపురం పంచాయితీలోని మెట్టగూడెంలో సారా తయారుచేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో బుధవారం తన సిబ్బందితో దాడి చేసి పట్టుకుని ఆమె వద్ద పది లీటర్ల సారా స్వాధీన పరుచుకుని అరెస్టు చేసి చింతలపూడి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.



ఏలూరులో ప్రజాగళం యాత్రలో చంటి అభివాదం



లింగపాలెం మండలం యడవల్లిలో రోషన్ కుమార్ ప్రచారం



కొయ్యలగూడెంలో జనసేన, బీజేపీ ఆత్మీయ కలయిక



గణపవరంలో పత్సమట్ల ధర్మరాజు ఎన్నికల ప్రచారం

సర్వే ఫలితాలు

కూటమి వైపే..

దిక్కుతోచని స్థితిలో అధికార పక్షం : బడేటి చంటి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 10: అన్ని సర్వేల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయం ఖాయమని తెలుస్తోందని, సైకో జగన్ దిక్కుతోచని స్థితిలో ఉన్నాడని బడేటి చంటి అన్నారు. 16వ డివిజన్ ప్రజాగళం సభలో బుధవారం ఆయన మాట్లాడుతూ పదే పదే అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేయడంలో జగన్‌ది అందివేసిన చేయి అన్నారు. వలంటీర్లపై జగన్ కపట ప్రేమ చూపుతున్నాడని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లకు ప్రభుత్వం రూ.10వేలు వేతనం ఇస్తుందన్నారు. ప్రతీ రోజురోజుకు జగన్ ప్రజల్లో విశ్వాసం కోల్పోతున్నాడని అన్నారు. ఎన్నికల్లో కూటమి విజయం తప్పదన్నారు. కార్యక్రమంలో శివప్రసాద్, కాశీనరేష్ వెంకటరత్నం, రమేష్, రాంబాబు, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం : రోషన్

లింగపాలెం: యడవల్లిలో కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ బుధవారం ప్రచారం నిర్వహించారు. గ్రామస్థులు అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని రోడ్లు, తాగునీరు, డ్రైనేజి నిర్మాణాలు పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి మల్లికార్జున్‌రావు, ముసునూరి రాము, గుత్తా సత్యసాయివరప్రసాద్, మహేష్‌గౌడ్, పిల్లల శ్రీనివాస్‌యాదవ్, చెన్ను శ్రీనివాస్‌యాదవ్, గజ్జా వెంకటేశ్వరరావు, చెరువుగట్టు రామ్మోహన్‌రావు, సుబ్బారావు, జయరాజు పాల్గొన్నారు.

చింతలపూడిలో ప్రచారం ఖేష్

చింతలపూడి: నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ విజయం కోరుతూ పార్టీ ప్రచారం బాగుందని టీడీపీ అధినేత అభినందించారని జగ్గవరపుముత్తారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో ప్రచార ర్యాలీపై నల్లజర్లలో చంద్రబాబు సమీక్ష నిర్వహించారని, సమీక్షలో జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మందలపు రవి, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, బొమ్మాజి అనిల్, ఆకుమర్తి రామారావు తదితరులు పాల్గొన్నారని తెలిపారు. చింతలపూడి ప్రచార తీరు బావుందని మరింత వేగవంతం చేయాలని చంద్రబాబు కూడా సూచించారని ముత్తారెడ్డి తెలిపారు. రోషన్‌కుమార్ విజయానికి పార్టీ కేడర్ సమైక్యంగా పనిచేస్తోందన్నారు.



గోపన్నపాలెంలో ప్రచారం చేస్తున్న చింతమనేని రాధమ్మ

గోపన్న పాలెంలో సూపర్ సిక్స్ పథకాల పై ప్రచారం

దెందులూరు: టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను చింతమనేని ప్రభాకర్ సతీమణీ చింతమనేని రాధమ్మ గోపన్నపాలెంలో ప్రజలకు వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, నేతలతో కలసి ప్రచారం చేశారు. పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమష్టిగా కష్టపడితే కూటమిదే గెలుపు

కొయ్యలగూడెం: సమష్టిగా కష్టపడితే కూటమిదే విజయమని బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్ అన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు బుధవారం ఆమెను కలిశారు. బీజేపీ, జనసేన నాయకులు ఆత్మీయ సమ్మేళనం జరిగింది. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని కోరారు. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి గెలుపు కోసం ప్రతీ ఒక్కరు అంకితభావంతో పని చేయాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు, ఎంపీ అభ్యర్థి మహేష్‌యాదవ్ విజయానికి ప్రతీ ఒక్కరు పని చేయాలన్నారు. బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వ స్థాపనకు సహకరించాలి : పత్సమట్ల

గణపవరం: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించి ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించేందుకు సహకరించాలని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ఓటర్లను అభ్యర్థించారు. గణపవరంలోని ఇందిరమ్మ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో వైసీపీని ఓడించి కూటమిని బలపరచాలని కోరారు. శరణాల మాలతీరాణి, ఇందుకూరి రామ కృష్ణంరాజు, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, కాపారం చిన్న, సుబ్బారావు, తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గణపవరం మండలం వల్లూరు సర్పంచ్ ముచ్చర్ల వేణుగోపాల మురళీ కృష్ణ, ఉపసర్పంచ్ పెద్దింటి శివరామకృష్ణ, కొండవీటి రమేష్ తదితరులు టీడీపీలో చేరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి విజయానికి కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.

చంద్రబాబు, పవన్ సదస్సుకు తరలిన నేతలు

కామవరపుకోట: తణుకులో జరిగిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రజాగళం సదస్సుకు మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు వివిధ వాహనాల ద్వారా తరలివెళ్లారు. వాహనాలకు టీడీపీ, జనసేన జెండాలు బ్యానర్లు తగిలించుకుని పచ్చ చొక్కాలు, బ్యాడ్జీలతో ఉత్సాహంగా వెళ్లారు. కార్యక్రమానికి టీడీపీ నాయకులు కోనేరు వెంకట సుబ్బారావు, కోటగిరి కిషోర్‌బాబు, నెక్కలపు సూర్యనారాయణ, కోనేరు వెంకట్రామయ్య, బొబ్బిలి డాన్ దివాకర్, నూతి రాటాలు, నెక్కలపు గంగాధర్, కోనేరు జయకృష్ణ, కోనేరు మోహన్ జనసేన మండల ఇన్‌చార్జి ఎస్‌కె.వలి తదితరులు కోలాహలంగా తరలివెళ్లారు.



మాదేపల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి, కలపర్రు వద్ద వాహనాల తనిఖీ, అధికారులతో సమీక్షిస్తున్న ఎస్ఈబీ ఎస్పీ

చెక్‌పోస్టులను తనిఖీ చేసిన ఎస్పీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 10 : ఎస్పీ మేరీ ప్రశాంతి బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామంలో చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసి సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేశారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, మద్యం, నగదు, వస్తువులు అక్రమ రవాణా జరుగకుండా 24 గంటలు తనిఖీ చేపట్టాలన్నారు. విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ పలువురు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసు తనిఖీలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ పార్కిళ్ళ వాహనాలు, కార్లు, మోటారు సైకిళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. రాత్రి గస్తీలో ఉన్న పోలీసులు ఏటీఎంలు, దేవాలయాలు, మసీదులు వద్ద అప్రమత్తంగా ఉండాలని అనుమానితులు ఎవరైనా ఉంటే అదుపులోకి తీసుకోవాలన్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత అనుమానాస్పదంగా ఉన్నవారిని అదుపులోకి తీసుకోవాలన్నారు. ఎటు వంటి నేరాలు జరుగకుండా గస్తీ ఏర్పాటు చేయాలన్నారు.

పెదపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు, పోలీసులు వాహన తనిఖీలను మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నారు. పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ వద్ద ఏలూరు వైపుగా వచ్చే వాహనాలను ఆపి తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి డబ్బు, ఇతర వస్తువుల రవాణాను నిర్వహించుకోవాలని వాహనదారులకు సూచిస్తున్నారు.

అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి : ఎస్ఈబీ ఎస్పీ

ఏలూరు క్రైం: అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ఎన్నికల కమిషన్ నిబంధనలు అనుసరించి విధులను నిర్వర్తించాలని ఎస్ఈబీ ఎస్పీ ఎన్‌వీఎస్ మూర్తి అన్నారు. ఎస్ఈబీ అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎస్ఈబీలో పని చేస్తున్న ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. అక్రమ రవాణా సమాచారం ఉంటే తక్షణం వెళ్లి చర్యలు తీసుకోడానికి అధికారులు, సిబ్బంది సంసిద్ధంగా ఉండాలన్నారు. ఎస్ఈబీ ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన తనిఖీల్లో మద్యం, నగదు సీజ్ చేయగలిగామని మరింత సమర్థవంతంగా విధులను నిర్వర్తించడానికి అధికారులు, సిబ్బంది శ్రమిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ డీఎస్పీ కె.జనార్ధననాయుడు, అసిస్టెంట్ గణపతిరావు, ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ జిల్లాలోని అధికారులు పాల్గొన్నారు.

స్పాట్ విధులు నిర్వహించిన టీచర్లకు సీసీఎల్స్ ఇవ్వాలి

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10: ప్రభుత్వ సెలవు దినాల్లో పదో తరగతి మూల్యాంకన విధులను నిర్వర్తించిన టీచర్లందరికీ సీసీఎల్ మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు బుధవారం డీఈవో అబ్రహంను కలసి వినతిపత్రాన్ని అందజేశారు. స్పాట్ విధులను 8 కిలోమీటర్ల దూరంపైబడి వచ్చి నిర్వహించిన వారందరికీ డీఏ ఇవ్వాలని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో డిప్యూటేషన్లు వేసిన టీచర్లందరినీ మాతృ పాఠశాలలకు పంపేలా ఉత్తర్వులివ్వాలని కోరారు. పాఠశాల విద్య కమిషనర్‌తో సంప్రదించి నిర్ణయాలు తీసుకుంటామని డీఈవో హామీ ఇచ్చారని ఏపీటీఎఫ్ నేతలు ప్రకాష్, రామశేషు, సుబ్బారావు, పొట్టియ్య, వెంకటేశ్వరరావు, మూర్తి వివరించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

పెదవేగి, ఏప్రిల్ 10: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ తాతా రమ్య అన్నారు. మండల పరిషత్ సమావేశం ఎంపీపీ రమ్య అధ్యక్షతన బుధవారం జరిగింది. వేసవిలో ప్రజలకు తాగునీటి సరఫరా సక్రమంగా అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. ఎక్కడైనా తాగునీటి ఎద్దడి ఏర్పడితే తక్షణం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్న నేపథ్యంలో తాగునీరు, పారిశుద్యం నిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో వంద మందికి కళ్లజోళ్లు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 10: అభయాంజనేయస్వామి సన్నిధిలో బుధవారం వారధి ట్రస్ట్ వ్యవస్థాపకుడు వలవల తాతాజీ నేతృత్వంలో డాక్టర్ కాకర్ల రామచంద్రబాబు ద్వారా వంద మంది లబ్ధిదారులకు కళ్లజోళ్లు అందజేశారు. కౌన్సిలర్ వలవల తాతాజీ మాట్లాడుతూ డాక్టర్ కాకర్ల రామచంద్రబాబు ఏటా నిర్వహించే ఉచిత నేత్ర వైద్య శిబిరంలో నిపుణులు ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బసవరాజు వేణు, పెదవేగి రాంబాబు, సామాజికవేత్త కెఎల్‌ఎస్ ధనకుమార్, ట్రస్టు ప్రతినిధులు కలపాల శ్రీనివాసరావు, మద్దిపాటి శ్రీను, కోట కృష్ణంరాజు, వసంతాటి మంగరాజు, కొత్తపల్లి శివ, కంబాల పండు, బోయిన సత్యనారాయణ, గంటా నాగార్జున తదితరులు పాల్గొన్నారు

వృద్ధ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



వృద్ధ కళాకారుడు వెంకట్రావు

టి.నరసాపురం, ఏప్రిల్ 10: వృద్ధ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ ప్రజానాట్య మండలి సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్.రాజు, సీనియర్ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ డిమాండ్ చేశారు. తిరుమలదేవిపేటలో వృద్ధ కళాకారుడు తోట వెంకట్రావును బుధవారం పరామర్శించారు. తెలంగాణ రాష్ట్రం మాదిరి వృద్ధ కళాకారుల గౌరవించి రూ.25 లక్షలు ఆర్థిక పారితోషికం, ప్రతినెల రూ.5వేలు పింఛన్ సౌకర్యం తోట వెంకటరావు లాంటి కళాకారులకు అమలు చేయాలని కోరారు. తోట వెంకటరావు 20 ఏళ్ల నుంచి రంగస్థలంపై అడుగుపెట్టారన్నారు. వెంకట్రావు కళావారసత్వాన్ని కుమారుడు తోట సత్యనారాయణ, మనవడు లక్ష్మీనారాయణ కాపాడుకుంటూ పౌరాణిక నాటకాలలో తమ ప్రత్యేకతను చాటుతున్నారని అభినందించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ కన్వీనర్ శెట్టి నాగబాలాజీ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలనకు వ్యవసాయ విద్యార్థులు



పని అనుభవంపై వివరిస్తున్న విద్యార్థులు

లింగపాలెం, ఏప్రిల్ 10: పంటల సాగులో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు వ్యవసాయ విద్యార్థుల కృషి అభినందనీయమని ఏలూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కె.ఫణికుమార్ అన్నారు. తువ్వ చిలుకరాయుడుపాలెంలో మార్కాపురం వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం క్షేత్ర పరిశీలన చేశారు. నూతన పద్ధతులు, పరిజ్ఞానంపై రైతులకు వివరించారు. గ్రామీణ వాతావరణం పని అనుభవాల గురించి విద్యార్థులు వివరించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం.నాగేంద్రబాబు, ఏవో కె.మురళీకృష్ణ, పలువురు వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



టీడీపీలో చేరిన వారితో చింతమనేని

పెదవేగి, ఏప్రిల్ 10: మేదినరావుపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు. చింతమనేని మాట్లాడుతూ టీడీపీలో ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తామన్నారు. అధికారం అంటే ప్రజల పట్ల బాధ్యతగా ఉండటమేనని, ప్రజల ఆస్తులను దోచుకు తింటున్న వైసీపీ పీచమణచడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గారపాటి రంగయ్య, తానంకి శరత్‌కుమార్, రాధాకృష్ణ, సత్యనారాయణ, కొమ్మన మురళీకృష్ణ, ప్రసాద్, గుడపాటి భీష్మ, తాళ్ళూరి రమేష్, సరిపల్లి రంగారావు తదితరులను ప్రభాకర్ అభినందించారు. మాగంటి నారాయణ ప్రసాద్, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మోతుకూరి నానీ, పరసా వెంకట్రావు, పెనుబోయిన మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేస్తాం



రాచన్నగూడెం సమావేశంలో నాయకులు

జీలుగుమిల్లి, ఏప్రిల్ 10: పోలవరం కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లి కిషోర్ అన్నారు. నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ సమావేశం రాచన్నగూడెంలో బుధవారం నిర్వహించారు. పోలవరంలో కాంగ్రెస్ ఉనికిని చాటుతామని జిల్లా నాయకులు కె.రాజరత్నం అన్నారు. నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు. ప్రత్యేక హోదా, వికలాంగులకు రూ.6వేలు పింఛన్, రైతు రుణమాఫి వంటి తొమ్మిది రకాల హామీలతో ముందుకు వెళతామన్నారు. అల్లి రాంబాబు, పైదా పోతురాజు, కంగాల పోసిరత్నం, బండి విజయభాస్కర్ బాడిస బుజ్జిదొర కుక్కునూరు, బుట్టాయగూడెం, పోలవరం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి.రాజులు , సీహెచ్.కుటుంబరావు, కె.వెంకటేశ్వరావు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలిగా ముచ్చిక సీత

పోలవరం, ఏప్రిల్ 10: కాంగ్రెస్ పార్టీ మండల చేగొండపల్లి పునరావాస గ్రామానికి చెందిన ముచ్చిక సీత ఎంపికైనట్లు సీనియర్ నాయకులు సంకురు బాబూరావు తెలిపారు. బుధవారం దేవరగొంది పునరావాస కాలనీలో ఆయన నివాసం వద్ద జరిగిన మండల కాంగ్రెస్ సమావేశంలో ముచ్చిక సీత ఎంపికపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సీత మాట్లాడుతూ మండలంలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. మండల నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో ముందుకు సాగి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తోలేటి రఘు, ఉండ్రాజవరపు మూర్తి ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉదయం ఒక పార్టీ.. సాయంత్రం మరో పార్టీలో..



ఉదయం టీడీపీలో చేరి, రాత్రి వైసీపీలో చేరిన నాగేంద్ర

దెందులూరు, ఏప్రిల్ 10: దెందులూరు నియోజకవర్గంలో నేతలు ఒక్కరోజులో రంగులు మారుస్తున్నారు. అలుగులగూడెం గ్రామానికి చెందిన వైసీపీ నేత కమ్ముల నాగేంద్ర స్థానిక టీడీపీ నేత సంపంగి వేణుగోపాల తిలక్, కలపాల చంద్రశేఖర్‌తో చింతమనేని ప్రభాకర్ సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు. రాత్రి వైసీపీ నేత కామిరెడ్డి నాని ఉదరగండి చంద్రమౌళి ఆధ్వర్యంలో కొఠారు అబ్బయ్యచౌదరి సమక్షంలో మళ్లీ వైసీపీలో చేరారు. ఎవరు.. ఎప్పుడు ఏపార్టీలో చేరతారో.. మారతారోనని కార్యకర్తల్లో గందరగోళం నెలకొంది. ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కల్చరల్ :** ముస్లింలకు ఎమ్మెల్యే ఆళ్లనాని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అల్లా దయతో నగరం సుభిక్షంగా ఉండాలని, ప్రజల జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని నాని ఆకాంక్షించారు.
- స్థానిక సుందరయ్య కాలనీ కుట్టు శిక్షణ కేంద్రానికి రోటరీక్లబ్ తరపున 4 కుట్టుమిషన్లు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు నేలపాటి రోహిత్ అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో మిషన్లు పంపిణీ చేశారు. జి.నరసింహారావు, కె.హేమంత్‌కుమార్, ఎం.జగదీశన్ నాగమణిప్రియ, ఎస్ఎస్ఆర్‌కే.ప్రసాద్, పి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.
- **ఏలూరు టూటౌన్ :** దళిత హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకులు జిజ్జువరపు జయరాజు బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. డీహెచ్‌పీఎస్ స్థాపించి 18 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆర్ఆర్.పేటలో జిజ్జువరపు ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. బేతళ సుదర్శన్, జుంజు మోజేష్, జగన్ పాల్గొన్నారు.
- **పెదపాడు :** వట్లూరు సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో ఆక్వా ఎక్చేంజ్ అగ్రిటెక్ సంస్థ క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో కళాశాల విద్యార్థినులు 8 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు.
- **ఉంగుటూరు :** కాగుపాడు గ్రామ సర్పంచ్ కడియాల విదూష్ణ, జానకిరాం దంపతులు బుధవారం వ్యక్తిగత కారణాల వల్ల వైసీపీకి రాజీనామా చేసినట్టు ఒక ప్రకటనలో వివరించారు.
- ఉంగుటూరు మండలం అప్పారావు పేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నక్కిరి పెద్దిరాజు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.



కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో పోలీసులు, రెవెన్యూశాఖ మానవహారం

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి

కొయ్యలగూడెం, ఏప్రిల్ 10: ప్రతీ ఒక్కరు ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి సూర్యతేజ కోరారు. కొయ్యలగూడెంలో బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సక్రమించిన ఓటు హక్కు ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విధిగా ఓటు హక్కును పోలింగ్ స్టేషన్‌లో వేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడానికి ఓటు హక్కు ఎంతో ఉపయోగకరమైందన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎండీడీవో అశోక్, సీఐ మధు బాబు, ఎస్సై విష్ణువర్ధన్, అధికారులు, వీఆర్వో రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



నారాయణపురంలో ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో ఖాజావలి

సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించాలి

పోలింగ్ నిర్వహణపై అధికారులకు ఆర్వో శిక్షణ

ఉంగుటూరు, ఏప్రిల్ 10: అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఖాజావలి అన్నారు. ఉంగుటూరు నియోజకవర్గ సెక్టోరల్ అధికారులకు నారాయణపురం హైస్కూలులో ఈవీఎంల పనితీరుపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈవీఎంలో బ్యాలెట్ పత్రాలు పొందుపరచడం, పోలింగ్‌పై ఈవీఎం యంత్రాలపై మాక్ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో రిటర్నింగ్ అధికారి ఖాజావలి, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ భానుశ్రీ ప్రత్యూష, ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం మండలాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

చెరువులను పూర్తిగా నింపాలి: ఆర్డీవో



ముదినేపల్లి, ఏప్రిల్ 10 : వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని ఏలూరు ఆర్డీవో ఖాజా వలీ ఆదేశించారు. ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల్లో నీరు అడుగంటి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మూడు రోజులుగా 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమవుతున్న వరుస కథనాలపై స్పందించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు బుధవారం ఆర్డీవో మండలంలో క్యాంప్ బెల్ ప్రధాన పంట కాల్వకు విడుదల చేసిన నీటిని, చెరువులను నింపే ప్రక్రియను పరిశీలించారు. కాల్వలకు నీటి విడుదలను కూడా పెంచినందున మండల స్థాయి అధికారులు, పంచాయతీల కార్యదర్శులు సమన్వయంతో వ్యవహరించి చెరువులను నింపేందుకు ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. కాల్వలకు నీటి విడుదల నిలిపివేసిన అనంతరం చెరువుల్లో నీరు లేదన్న ఫిర్యాదులు ఏ గ్రామం నుంచి రాకూడదని స్పష్టం చేశారు. పశువుల చెరువులను కూడా పూర్తిస్థాయిలో నింపాలని, ప్రధాన, బ్రాంచి కాల్వల నుంచి తాగునీటి అవసరాలకు తప్ప ఇతర అవసరాలకు నీటిని తరలించకుండా బృందాలు నిఘా ఉంచాలని తెలిపారు. ఆక్వా కల్చర్‌కు అనధికారికంగా నీటిని మోటార్ల ద్వారా తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆదేశించారు. ఎంపీడీవో మురళీ గంగాధరరావు, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.



పట్టించుకునేదెవరు..?

తుప్పల మధ్య వరాహ పుష్కరిణి

ఆగిరిపల్లి, ఏప్రిల్ 10: పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి గ్రహణం పట్టింది. ఆగిరిపల్లిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అనుబంధ వరాహ పుష్కరిణి దేవదాయ, ధర్మదాయశాఖ నిర్లక్ష్యంతో నీరులేక, మెట్లపై పిచ్చి మొక్కలు పెరిగి ఉన్న నీరు మురికిగా మారి చూపరులకు భీతిగొలుపుతోంది. మొన్నటి వరకు దాతలు ముందుకు వచ్చి అభివృద్ధికి సహకరిద్దామనుకున్నా ఎండోమెంట్ అధికారులు స్పందించకపోవడం వల్ల మెట్లకోనేరుకు ఈ దుస్థితి దాపురించిందని స్థానికులు వాపోతున్నారు. కొత్త ఈవో చొరవతోనైనా కోనేరు దశ మారుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.



ఉనికిలిలో పిన్నమనేని బాబ్జి, పెదగొన్నూరులో కామినేని ప్రచారం



పార్థసారథి గెలుపు కోసం కోడలు అమృత ప్రచారం



చనుబండలో మాట్లాడుతున్న నూజివీడు కూటమి అభ్యర్థి పార్థసారథి

పంచాయతీల నిధులు దోచేసిన జగన్

మండవల్లి: జగన్ ఐదేళ్ళ విధ్వంసకర పాలనలో పంచాయతీల నిధులను సైతం దోచేశారని, రానున్నది కూటమి ప్రభుత్వమేనని మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఉనికిలి, ఇంగిలిపాకలంక, శ్రీరామ్‌నగరం, పెరికేగూడెం గ్రామాల్లో టీడీపీ మండవల్లి మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. జగన్ పాలనలో గ్రామాల్లో కనీస సౌకర్యాలు సైతం కరువయ్యాయన్నారు. రానున్న రోజుల్లో గ్రామాలకు ఆర్థిక స్వరాజ్యం వచ్చేలా కూటమి ప్రణాళిక ఉంటుందని కామినేని శ్రీనివాస్ కుటుంబ సభ్యులు కామినేని సుజాత, కామినేని తులసి, కామినేని దీప, కామినేని మధు ప్రచారం చేశారు. గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్యచౌదరి (బాబ్జి), భైరవపట్నం సజ్జ బాబి, గజ్జల గణేష్, నిమ్మగడ్డ బుజ్జి, నాగనబోయిన పవన్, గన్నమనేని నాని, మేక రాయుడు, గాంధీ, కొడాలి వెంకటేశ్వరరావు, సుబ్బారావు, కొడాలి బుజ్జి, యూనిట్ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను గెలిపించాలని మండలంలోని పుట్లచెరువు, పెరికే గూడెం గ్రామాల్లో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులతో కలసి కామినేని కుటుంబీకులు కామినేని సుజాత, కామినేని తులసి, కామినేని దీపిక ఇంటింటి ప్రచారం చేశారు. అలాగే టీడీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్‌యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని, కామినేనికి కమలం గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. టీడీపీ మండవల్లి మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు పిండి నాగాంజనేయులు, క్లస్టర్ ఇన్‌చార్జి కూనపురెడ్డి కోటేశ్వర రావు, యూనిట్ ఇన్‌చార్జి ఎలికే రాంబాబు, మాజీ సర్పంచ్ పరసా సర్వేశ్వరరావు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సింహాద్రి, శివనాగరాజు, బుచ్చం శాస్త్రులు, బావిని వెంకన్నబాబు, దివి శశి, కరణం సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

త్వరలో చంద్రన్న సంక్షేమ రాజ్యం

కైకలూరు: త్వరలో ప్రజాశ్రేయస్సు కోరే చంద్రన్న సంక్షేమ రాజ్యం రాబోతుందని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. బుధవారం కైకలూరు మండలం వరహాపట్నం, తామరకొల్లు, రాచపట్నం, పెంచికలమర్రు, కైకలూరు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని ఇంటింటికి తిరిగి అభ్యర్థించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ప్రత్యక్షంగా కన్పిస్తుందని, వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. రానున్న చంద్రబాబు పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర కులాలకు సమన్యాయంగా పథకాలు అందుతాయన్నారు. తెలుగు మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, టీడీపీ నాయకులు కాంట్రాక్టర్ కృష్ణంరాజు, తెంటు నాగేశ్వరరావు, పళ్లెం తాతారావు, పామర్తి రాంబాబు, ఈదా వెంకటస్వామి, శీలం కృష్ణవేణి, పడమటి వాసు, వీరాబత్తిన సుధా, జనసేన నాయకుడు రామాంజ నేయులు, బీజేపీ నాయకుడు సమయం ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

పవన్ త్యాగం అమోఘం : కామినేని

ముదినేపల్లి: రాష్ట్ర భవిష్యత్తు కోసం జనసేన అధినేత పవన్ కల్యాణ్ త్యాగం అమోఘమని కైకలూరు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెదగొన్నూరులో బుధవారం తన గెలుపు కోరుతూ సినీ నిర్మాత డాక్టర్ కె.ఎల్.నారాయణతో కలసి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడేందుకు పవన్ అనుసంధానకర్తగా వ్యవహరించి విజయం సాధించారని, తాను కైకలూరు నుంచి పోటీ చేయటానికి కూడా పవన్ కల్యాణ్ చేసిన పొత్తుల ప్రయత్నం సఫలం కావటమేనని కామినేని స్పష్టం చేశారు. జనసేనకు సీట్ల సర్దుబాట్లలో కూడా పవన్ త్యాగం కనబర్చారని, ఇందుకు కారణం రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించాలన్న సంకల్పం పవన్ కళ్యాణ్ బలంగా ఉండటమేనన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

సినీ నిర్మాత డాక్టర్ కేఎల్ నారాయణ



ముదినేపల్లి, ఏప్రిల్ 10 : రైతులు, చేనేత కార్మికులు, ఇతర వృత్తుల వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని దుర్గా ఆర్ట్స్ అధినేత, సినీ నిర్మాత డాక్టర్ కె.ఎల్. నారాయణ తెలిపారు. తన స్వగ్రామం పెదగొన్నూరులో కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తో కలసి బుధవారం ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. విశ్వనాద్రిపాలెం, ఉప్పరగూడెం గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న ముంపు సమస్య నివారణ, పెదలంక మేజర్ డ్రైన్, దాని అనుబంధ డ్రైన్ల అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామంలో కొత్తగా పశువుల ఆసుపత్రి భవన నిర్మాణంతోపాటు, తాగునీటి సమస్య పరిష్కరిస్తామ న్నారు. కైకలూరు నుంచి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను, ఏలూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను గెలిపిం చాలని కోరారు. కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ మరోసారి జగన్ ప్రభుత్వం వస్తే రాష్ట్రం అంధకారంలోకి వెళ్లటం ఖాయమని, 2019లో చేసిన పొరపాటు ఈ ఎన్నికల్లో చేయవద్దని ఓటర్లను కోరారు. టీడీపీ నాయకులు యెర్నేని కిషోర్, కొడాలి వినోద్, చల్లగుళ్ల ఆదిత్య, యార్లగడ్డ గంగయ్య, వీరంకి చక్రపాణి, దావు నాగరాజు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పైడిపాటి శివశంకర్, జనసేన నాయకులు వీరంకి వెంకటేశ్వరరావు, మోటేపల్లి హనుమ పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావటం చారిత్రక అవసరం

చాట్రాయి: వైసీపీ అరాచక పాలనతో అన్ని రంగాల్లో అధోగతి పాలైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి చంద్రబాబు సీఎం కావటం చారిత్రక అవసరమని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని చనుబండ, సూరంపాలెం, జనార్దనవరం, అరుగొలనుపేట గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా సూరంపాలెం వీరాంజనేయస్వామికి పూజల అనంతరం కూటమి నాయకులతో కలసి ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చనుబండలో ముస్లింల శ్మశానవాటికకు బోరు, సూరపాలెం గౌడబజారులో మోటారు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. సీసీ డ్రెయిన్లు, రోడ్లు, అంగన్వాడీ, కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని స్థానికులు కోరగా అధికారంలోకి రాగానే చేయిస్తానని హామీ ఇచ్చారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయకుండా సీఎం జగన్ రెండు జిల్లాల రైతాంగానికి తీరని ద్రోహం చేశారని విమర్శించారు. వైసీపీ బూటకపు వాగ్దానాలను నమ్మవద్దని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి రాష్ట్ర శ్రేయస్సు కోసం, భావితరాల బంగారు భవిష్యత్తు కోసం కూటమికి ఏకపక్షంగా ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

కూటమితో బీసీలకు ఉజ్వల భవిత: కొలుసు

బీసీలంతా ఏకతాటిపై నిలిచి కూటమిని అధికారంలోకి తెచ్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు మన సొంతం అవుతుందని పార్థసారథి అన్నారు. చనుబండలో బుధవారం జరిగిన జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో బీసీలపై దాడులు పెరిగాయని, చంద్రబాబు సీఎం కాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టంతో పాటు, బీసీ సబ్ ప్లాన్ ద్వారా 5 ఏళ్లలో రూ. లక్షన్నర కోట్లు ఖర్చు చేయటం, 50 ఏళ్ళకే రూ. 4 వేలు పింఛన్, స్థానిక సంస్థల రిజర్వేషన్లు 24 నుంచి 34 శాతానికి పెంపు, చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం, అన్ని నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేస్తారన్నారు. బీసీ యువత ఉపాధికి నిధులు కేటాయిస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, ప్రదీప్, నక్కా రాము, పలగాని దుర్గారావు, చంద్రకళ, కలకొండ భాస్కరరావు, ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, పానుగళ్ళ కోటేశ్వరరావు, నోబుల్ రెడ్డి, తల్లాడ శ్రీను, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెరికేగూడెంలో కామినేని బంధువుల ప్రచారం

నూజివీడు: నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి విజయం కోరుతూ ఆయన కుటుం బీకులు విస్తృత ప్రచారం నిర్వహి స్తున్నారు. బుధవారం నూజివీడు 7వ వార్డులో పార్థసారథి కోడలు అమృత ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించి, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆమెకు తెలపగా టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టణంలో డ్రైనేజి వ్యవస్థ మెరుగుదల, పక్కా రహదారుల నిర్మాణానికి పార్థసారథి ప్రథమ ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, టీడీపీ నూజివీడు పట్టణ ఉపాధ్యక్షుడు తిరుమలశెట్టి ప్రదీప్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గొల్లు దుర్గాదేవి, పాదం సత్యనారాయణ, లక్ష్మీగౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భారీ బైక్ ర్యాలీ

ముదినేపల్లి: ఎన్నికల్లో ఏలూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు నుంచి పెదగొన్నూరు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, పార్టీ నాయకులు జాస్తి రాజా, దావు నాగరాజు, యర్రా రాంబాబు, బొంగు రవికుమార్, పంతగాని సురేష్, జనసేన నాయకులు వీరంకి వెంకటేశ్వరరావు, మోటేపల్లి హనుమ, దూసనపూడి బ్రహ్మాజీ, బాసినశెట్టి కిషోర్, బీజేపీ నాయకులు శంకర్, యర్రా నాని తదితరుల నాయకత్వంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కలిదిండి: బర్రెంకుల గరువులో బుధవారం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, కూటమి నాయకులు నల్లగోపుల చలపతిరావు, కురేళ్ల ఏడుకొండలు, గూడవల్లి శ్రీనివాసరావు, గుడిపాటి శివరామకృష్ణ, పేటేటి సత్యనా రాయణ, యడవల్లి వెంకటేశ్వరరావు, వాకాని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

15న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరుసిటీ, ఏప్రిల్ 10: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జిల్లా ప్రజాపరిషత్ సమావేశాలు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈనెల 15 వతేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్టు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కెఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు. జిల్లాలో అమలు జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు.

క్రైం కార్నర్

కుక్కల దాడి..

ఆరు పశువులు, రెండు గొర్రెల మృతి

ముసునూరు, ఏప్రిల్ 10: ముసునూరు ఎస్సీ కాలనీలో పశువులపై మంగళవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో ఆరు పశువులు, రెండు గొర్రెలు మృతి చెందగా, ఒక గేదెదూడ అపస్మారక స్థితిలో ఉంది. ఎస్సీ కాలనీ వాసులు కొడవలి డేవిడ్‌కు చెందిన ఒక ఆవు, రెండు పుంజులు, బడిపాటి సుగుణరావు పాడిగేదె, గొల్లపల్లి మధు, సగ్గుర్తి సుగుణరావు, చలపాటి నల్లయ్య గేదె దూడలు, మద్దాల శౌరికి చెందిన రెండు గొర్రెలపై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన పశువులు, జీవాలు అక్కడికక్కడే మృతిచెందగా, ఒక గేదెదూడ చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. వీటి విలువ రూ.2 లక్షల 50వేలు ఉంటుందని వాటి పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, ఇటీవల ఆడుకుంటున్న పిల్లలపై దాడిచేస్తే పలువురు గాయాలపాలయ్యారని కాలనీ వాసులు చెప్పారు. ఇంటి ప్రాంగణంలో కట్టివేసిన పశువులు, గొర్రెలను కూడా కుక్కలు బ్రతకనీయడం లేదని, ఇప్పటికైన కుక్కల నియంత్రణకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బోర్ల సామగ్రి చోరీ

ముసునూరు, ఏప్రిల్ 10: మండలంలోని గోపవరం శివారు పెద్దపాటి వారిగూడెంలో మంగళవారం రాత్రి వ్యవసాయ బోర్ల కేబుల్ వైర్లు, స్టార్లర్లు, ఫ్యూజులకు ఉన్న రాగి వైరు సైతం చోరికి గురయ్యాయి. సుమారు 36 మంది రైతులకు చెంది 40 వ్యవసాయ బోర్ల సామాగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. వీటి విలువ రూ.208 లక్షలు ఉంటుందని బాధిత రైతులు మాకినేని నాగార్జున, వేలగపూడి గంగధరరావు, ఉండవల్లి కిరణ్ కుమార్, ఉప్పాలపాటి గణేష్ తదితరులు తెలిపారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు. మండల వ్యాప్తంగా ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ బోర్ల సామగ్రి చోరీలు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయని, వీటిపై పోలీసులు ప్రత్యేక నిఘాపెట్టి చోరీలను నియంత్రించాలని రైతులు కోరుతున్నారు.

వలంటీర్లు రాజీనామా చేయవద్దు

ముదినేపల్లి రూరల్, ఏప్రిల్ 10: గ్రామ వలంటీర్లు ఎవరూ తమ ఉద్యోగాలకు రాజీనామా చేయాల్సిన పనిలేదని టీడీపీ అధికారంలోకి రాగానే వారిని కొనసాగిస్తామని ఆ పార్టీ నాయకుడు కొడాలి వినోద్ భరోసా ఇచ్చారు. బుధ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు గ్రామ వలంటీర్లతో ఆడుకుంటున్నారని వారిని అడ్డు పెట్టుకుని దొడ్డిదారిలో గెలవాలన్న కుట్రతోనే వలంటీర్ల రాజీనామా డ్రామాకు తెరతీశారని ఆరోపించారు. వలంటీర్లు అధికారపార్టీ నాయకులు మాటలు నమ్మి మోసపోవద్దని, చంద్ర బాబు సీఎం అయిన వెంటనే వలంటీర్లకు నెలకు పదివేలు చొప్పున వేతనాలు ఇస్తారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి వలంటీర్లు ఎవరు అధికారపార్టీ నాయకులకు తొత్తులుగా పనిచేయవద్దని పార్టీలకు అతీతంగా విధులు నిర్వహించాలని కోరారు.



కూటమిలో చేరికలు

ముదినేపల్లి రూరల్, ఏప్రిల్ 10 : ముదినేపల్లి మండలం ఉప్పరగూడెం పీఏసీఎస్ అధ్యక్షులు శ్రవణం పూర్ణచంద్రరావుతోపాటు ఆ గ్రామానికి చెందిన యాసర్ల మురళి ఆధ్వర్యంలో పలువురు యువకులు టీడీపీలో చేరారు. బుధవారం రాత్రి కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, సినీ నిర్మాత డాక్టర్ కె.ఎల్.నారాయణ సమక్షంలో ఆ గ్రామంలో పెద్ద సంఖ్యలో పలువురు టీడీపీలో చేరారు. తాము కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి రావటం తథ్యమని అన్నారు.

ముద్దరబోయిన ప్రచారం

ఆగిరిపల్లి, ఏప్రిల్ 10: ఆగిరిపల్లి మండలంలో బుధవారం ఎస్.ఏపేట, పిన్నమరెడ్డిపల్లి, నూగొండపల్లి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన ప్రచారం నిర్వహించారు. తాను గెలిస్తే నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడ తానని, ప్రత్యేకంగా చింతలపూడి ఎత్తిపోతల, తాగునీరు, రహదారుల సమస్య పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో..

108 మంది వలంటీర్ల రాజీనామా

భీమడోలు : వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు రాజీనామాలు చేశారు. భీమడోలు మండలం పలు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న 23 మంది గ్రామ వలంటీర్లు బుధవారం తమ రాజీనామా పత్రాలను అధికారులకు అందజేశారు. భీమడోలు, ఆగడాలలంక, పోలసానపల్లి తదితర గ్రామాల్లో పనిచేస్తున్న వలంటీర్లు ఆయా గ్రామ పంచాయతీలు, సచి వాలయ అధికారులకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

ఉంగుటూరు : ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో ఎనిమిది మంది, బొమ్మిడిలో ఒకరు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో శర్మ తెలిపారు.

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురంలో బుధవారం 14 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రా లను పంచాయతీ కార్యదర్శి సప్తగిరికి అందించారు.

ఆకివీడు :ఆకివీడు సచివాలయం-2కు చెందిన తొమ్మిది మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు.

ఆచంట : పెనుమంచిలిలో మరో ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్ తెలిపారు.మండలంలో 290 మంది వలంటీర్లకు ఇప్పటి వరకు 234 మంది రాజీనామా చేశారు.

ముసునూరు : ముసునూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన 29 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో పద్మావతి దేవికి అందజేశారు. మొత్తం 35 మంది వలంటీర్లకు ఉండగా సచివాల యం-1 పరిధిలో 18 మందికి 17 మంది, సచివాలయం-2 పరిధిలో 17 మందికి 12 మంది రాజీనామాలు చేశారు.

నూజివీడు టౌన్ :నూజివీడు పట్టణం 1వ వార్డుకు చెందిన 14 మంది వలంటీర్లు తమ రాజీనామాలను నూజివీడు మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డికి అందించారు.

ఆగిరిపల్లి :ఆగిరిపల్లి మండలం ఈదులగూడెంలో బుధవారం 8 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వీరితో ఇప్పటికి మండల వ్యాప్తంగా 13 మంది రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు.



సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ

కైకలూరు, ఏప్రిల్ 10: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ డి. మేరీ ప్రశాంతి అన్నారు. బుధవారం కైకలూరు మార్కెట్‌యార్డ్‌లోని ఎన్నికల సామగ్రిని అందజేసే గోదామును, పట్టణంలోని యూపీ స్కూల్ పోలింగ్ బూత్‌ను, మండవల్లి మండలం మణుగులూరులోని పోలింగ్ బూత్‌లను ఎస్పీ ఆర్వో కె. భాస్కర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కైకలూరు పోలీ స్ స్టేషన్లో సిబ్బందితో ఎన్నికల విధులపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాల సరిహద్దులో పటిష్ట నిఘాను ఏర్పాటు చేశామని అపరిచిత వ్యక్తులు తారసపడితే వారి పూర్తి సమాచారం తెలుసుకునే వరకు వదిలే ప్రసక్తి లేదని అదేవిధంగా ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తామన్నారు. సమస్యాత్మకమైన గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని గతంలో ఎన్నికల సమయంలో కేసుల్లో ఇరుక్కున్న వారిని ముందుగా బైండోవర్ చేస్తామన్నారు. అల్లరి మూకల అల్లర్లు లేకుండా సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పోలీస్ సిబ్బంది ఇప్పటి నుంచే గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారిపై అప్రమ త్తం గా ఉండాలన్నారు. సీఐలు ఎ. రఘు, కృష్ణకుమార్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హోమియో డే

ఆగిరిపల్లి, ఏప్రిల్ 10: హోమియో పితామహుడు డాక్టర్ హానిమన్ జయంతిని పురస్కరించుకుని ఆగిరిపల్లి హోమియో వైద్యశాలలో ప్రపంచ హోమియో దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ రజిత మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి అల్లోపతి వైద్యం ద్వారా వచ్చే దుష్ప్రభావాలను దూరం చేయటానికి తనమీద, తన కుటుంబం మీద ప్రయోగాలు చేసుకుని డాక్టర్ శామ్యూల్ హానిమన్ హోమియో వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారని ఇందుకు కృతజ్ఞతగా ఆయన జయంతిని వరల్డ్ హోమియో డేగా గుర్తించారన్నారు.

కలిదిండి మండలంలో నేడు కామినేని ప్రచారం

కలిదిండి, ఏప్రిల్ 10 : కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ గురువారం కలిదిండి మండలంలో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు తెలిపారు. కొండంగి, మట్టగుంట, పెదలంక, మూల్లంక గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు నున్న రామారావు మృతి



కలిదిండి, ఏప్రిల్ 10 : సానారుద్రవరం గ్రామానికి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు నున్న రామారావు (85) బుధవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, సానారుద్రవరం సర్పంచ్ నున్న రాజేశ్వరమ్మ, ఎంపీటీసీ తమనాల మహాలక్ష్మి తదితరులు రామారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి

ముసునూరు, ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని నూజివీడు సీఐ కె.రామకృష్ణ అన్నారు. బుధవారం ముసునూరులో ఎస్ఐ పి.వాసు ఆధ్వర్యంలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకుని, సమర్థవంతమైన పాలకులను ఎన్నుకోవాలని వివరించారు. ప్రధాన కూడళ్లలో కోడ్‌పై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ఏఎస్ఐ నాగభూషణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

నూజివీడు టౌన్, ఏప్రిల్ 10: నూజివీడు మండలం కొత్త అన్నవరం మహిళా సొసైటీ పాడి రైతులకు బుధవారం బోనస్‌ను పంపిణీ చేశారు. గత ఏడాది డిసెంబర్ నుంచి మార్చి నెలాకరు వరకు నాలుగు నెలల కాలానికి మొత్తం 142 మంది మహిళా పాడిరైతులకు రూ.3,02,970లు బోనస్ రూపంలో పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షురాలు కుంపటి శశిరేఖ బోనస్‌ను పంపిణీ చేయగా, హనుమాన్ జంక్షన్ పాల శీతల కేంద్రం మేనేజరు కిలారు కిరణ్‌కుమార్, రూట్ సూపర్‌వైజర్ పొన్నగంటి గణేష్, వేతన కార్యదర్శి కొలుసు గంగాధర్, పాడిరైతులు పాల్గొన్నారు.

మతోన్మాదశక్తుల్ని ఎదుర్కొనేలా కవిత్వం ఉండాలి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 10: మతోన్మాదశక్తులను ఎదుర్కొనే లౌకిక భావాలను ప్రచారం చేసే కవిత్వం అవసరం ఎంతో ఉందని, ఆ దిశగా కవులు, తమ కలాలను నడిపించాలని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్ పేర్కొన్నారు. ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి నూజివీడు అమర్‌భవన్‌లో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ప్రముఖ కవి దారా మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాగర్ మాట్లాడుతూ సాహిత్యం సమాజాన్ని అభివృద్ధిపథం వైపు నడిపేలా ఉండాలన్నారు. అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలసాని వెంకటరామారావు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శిఖా ఆకాష్, జిల్లా నాయకులు ఈమని శేషయ్య, గుత్తికొండ అహల్య, ఎస్కేడీ ప్రసాద్ తమ కవితలను వినిపించారు. అరసం జిల్లా పూర్వ అధ్యక్షులు ఆర్.ఎన్.ఆర్ స్మారక అవార్డును కవి జడ సుబ్బారావుకు అందించారు.

ఓటు హక్కు వినియోగంపై కళాజాత

మండవల్లి, ఏప్రిల్ 10: ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజల్లో అవగాహన కల్గించేందుకు ఏలూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో జానపద గీతాలతో కళాజాత బృందం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ బృందంలో వై. వీరయ్య, వై. రవితేజ ఆధ్వర్యంలో 10 మంది కళాకారులు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు.

దూండి రాకేశ్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

కైకలూరు, ఏప్రిల్ 10: టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దూండి రాకేశ్‌పై దాడికి యత్నించిన వ్యక్తులపై తక్షణమే కేసు నమోదు చేయాలని ఏలూరు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కెకె బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కైకలూరులో మాట్లాడుతూ విజయవాడ ఆర్య వైశ్య సమావేశంలో వెల్లంపల్లి శ్రీనివాస్ అనుచరులు దూండి రాకేశ్, బొండా ఉమపై దాడికి యత్నించి దూషించడం దారుణమన్నారు. కేసు నమోదు చేయకుండా పోలీసులు కాలయాపన చేస్తున్నారని తక్షణమే దోషులపై అరెస్ట్ చేయాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్య పరిరక్షణ: మరీదు



నూజివీడు, ఏప్రిల్ 10: ప్రజా స్వామ్య పరిరక్షణ, కాంగ్రెస్‌తోనే సాధ్యమని నూజివీడు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మరీదు కృష్ణ అన్నారు. బుధవారం నూజివీడు పార్టీ కార్యాలయంలో ఆయన స్థానిక నాయకులతో మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించటంలో టీడీపీ, వైసీపీలు విఫలం అయ్యాయన్నారు. ప్రజలు తమ భవిష్యత్తుకోసం కాంగ్రెస్‌కు అండగా నిలవాలన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బి.డి. రవికుమార్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పరిమి సాగర్‌కుమార్, యూత్ కాంగ్రెస్ కార్యదర్శులు గోళ్ళ పవన్‌కుమార్, బొందిలి రామ్‌సింగ్, సీనియర్ నాయకులు యలమంచిలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.